# చిత్రం చిరిగిపోయింది

వేసవి సెలవులు పదిహేనురోజులూ ఇట్టే గడిచి పోయాయి. మళ్ళీ కాలేజ్, హాస్పిటల్, రోగాలు - వీటి మధ్య నేనూ ఓ భాగంగా బ్రతకడానికి ప్రయాణ మయ్యాను.

మా ఊరి నుండి ప్రయాణమంటే అంత సులభమైన విషయమేమీ కాదు. అసలు మా ఊరి దగ్గర బస్సులో ప్రయాణం చెయ్యడం ఓ మరపురాని అనుభవం. రెండే రెండు బస్సులు ఆరూట్‌లో వున్న ప్రజలకు అనల్పమైన సేవ చేస్తూ వుంటాయి. వంతులవారీ గానూ, కొండొకచో ఒక్కసారే విశ్రాంతి తీసుకుంటాయి. ఇంక బస్సులో డ్రైవర్, కండక్టర్, క్లీనర్లు ఇద్దరు, ఓనర్, ఓనర్ కొడుకులు, ఓనర్ వేలువిడిచిన బామ్మర్ది కూర్చోగా మిగిలిన స్థలంలో ఎంతమంది ఎక్కితే అంత మందిని లేదనకుండా బస్తాలో వడ్లు పోసి కుక్కినట్లు కుక్కేస్తారు. మరీ స్థలం లేకపోతే టాపుమీద కూడ ప్రయాణీకులు ఎక్కగా నిండు చూలాలిలా కదుల్తుంది. కదిలినబస్సు ఆగుతుందో లేదో, గమ్యాన్ని చేరుస్తుందో లేదో, గమ్యం చేరేలోపు శరీర భాగాలు సురక్షితంగా వుంటాయో లేవో చెప్పలేం. బస్సు టాప్, సీట్ కలిసి సమతలమంటే ఏమిటో ఎరుగని రోడ్డుమీద ప్రయాణీకుల్ని బంతిగా చేసి ఆడుకుంటాయి. బస్సు ఎక్కడ చెడిపోతే అక్కడ మెకానిక్స్‌లాంటి క్లీనర్లు బస్ అడుగున తీరికగా పడకేసేసి రిపేరింగ్ మొదలుపెడతారు. మళ్ళీ అది కదుల్తుందో లేదో నన్నది దైవాధీనం. ఇవి కాక ముప్పైమైళ్ల యీ బస్సురూట్‌లో సంవత్సరానికి రెండు మూడుసార్లు పొంగిపోయే ఓ ఏరూ, ఓ కోడూ - ఆ సమయంలో మా బస్సులకు ప్రకృతిచ్చిన ఆటవిడుపు - ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రదేశపు అభివృద్ధికి చిహ్నాలు మాబస్సులు, రోడ్డూ.

ఆరోజు నేను బయల్దేరిన వేళావిశేషం మంచిదేమో, మరీ ఆలస్యం చెయ్యకుండా రావలసిన టైమ్‌కు రెండుగంటలు మాత్రమే ఆలస్యంగా వచ్చింది బస్సు. ఓ చిన్న సైజ్ యుద్ధంలాంటిది చేసి బస్సులో శరీరాన్ని చేర్చగలిగాను. కూర్చోవడానికి చోటు లేకపోవడం వల్ల వంగుని వేళ్లాడుతున్నాను. కోలాహలంతో మా రథం సాగింది. ఒక్క విసురుతో వెళ్ళి ఒకావిడ ఒడిలో పడ్డాను. నేను ముచ్చట పడి కొనుక్కున్న హైహీల్డ్ చెప్పులు ఆ సుదతి సుకోమల పాదద్వయంపై పడ్డాయి. ప్రక్కవాళ్లని, నన్ను ఒక్క నెట్టు నెట్టి సురక్షితంగా ప్రక్కన కూలేసి చదువుకున్న అమ్మాయిల పోకిళ్లను దుమ్మెత్తి పోయనారంభించిందావిడ. వంచిన తల ఎత్తకుండా చేతిలోని వ్యానిటీబాగ్ మీద రిసెర్చి చేస్తున్నట్లు చూస్తూ కూర్చున్నాను.

"ఏవమ్మాయి శారదా!" పరిచితమైన కంఠస్వరం విని తలెత్తి చూచాను. భానుమూర్తి మాస్టారు! నేను స్కూల్ ఫైనల్ చదువుతూండగా అప్పుడే బి.యిడి. పాసయి తెలుగు మాష్టారుగా వచ్చిన భానుమూర్తిమాష్టారు. భవిష్యత్తును గూర్చి అందమైన కలలతో తూగిపోతూ అందంగా, సున్నితంగా వుండే భావుకుడు

భానుమూర్తిమాస్టారు. అనుక్షణం ఖుషీగా, కులాసాగా, దర్జాగా వుంటూ చక్కని భార్యతోనూ, ముద్దులొలికే బాబుతోనూ చూచే వాళ్లకు యీర్ష్య కలిగించే భానుమూర్తిమాస్టారు...

"నమస్కారం మాస్టారూ!" అన్నాను ఓ క్షణం తరువాత ఆలోచనలలోనుండి తేరుకుని.

"నమస్కారం... నమస్కారం. మెడిసిన్ చదువుతున్నావటకదూ! గుడ్... వెరీ గుడ్" అన్నారు మాస్టారు. అప్పుడు గమనించాను మాస్టారు సీటలేక క్రింద కూర్చుని వుండడం. డ్రెస్ విషయంలోనూ, అలంకరణ విషయంలోనూ ప్రత్యేకత చూపించే మాస్టారు... పాంట్ ఎక్కడ నలిగిపోతుందోనన్నట్లు అతిజాగ్రత్తగా మసలే భానుమూర్తి మాస్టారు... పంచె కట్టుతో, మాసిన గెడ్డంతో క్రింద కూర్చుని వుండడం నాకెంతైనా ఆశ్చర్యం కలిగించింది.

"ఇప్పుడు ఎక్కడ వుంటున్నారు మాస్టారూ? నిర్మలగారు, బాబు బావున్నారా?" కుతూహలం మించిపోగా ప్రశ్నల పరంపరని కురిపించాను.

"నిర్మలకేం బాగానే వుంది. అసలే అందమయిందా, పాప పుట్టిన తరువాత మరీ అందంగా తయారయింది. ఇంక బాబును కోరుకొండ సైనిక్ స్కూల్లో చేర్పించాను. రేపు పద్దెనిమిదవ తేదీ నుండి ఆంధ్ర విశ్వకళాపరిషత్ అధ్వర్యాన వైజాగ్‌లో సాహిత్య సభలు జరుగుతున్నాయి. ఎంత వద్దన్నా, యీ బాధ్యతంతా నేను మోయలేను బాబోయ్ అని మొత్తుకున్నా వినకుండా ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీగా వేసారు నన్ను. తెలుగు సాహిత్యంలో కాస్త పేరుప్రఖ్యాతులున్న పెద్దవాళ్ళు నలుగురూ భానుమూర్తిగారూ! మీరీ భారాన్ని వహించక తప్పదు. మామాట తీసివెయ్యకండి అంటూంటే మరి మాట్లాడలేక పోయాను." నోరు తెరుచుకుని, రెప్పవాల్చకుండా ఊపిరిపీల్చకుండా వింటున్నాను. ఎక్కడి భానుమూర్తి మాస్టారు! ఎక్కడ కోరుకొండ సైనిక్ స్కూల్!! ఎక్కడ సాహిత్య సభలు!!! వీటిని సమన్వయించుకోలేక అయోమయంగా చూస్తూ కూర్చున్నాను.

"పోనీ సెక్రటరీగా వేసి వదిలిపెట్టారా! భానుమూర్తి గారూ! నిజంగా మీలాంటి వక్త అరుదు. స్వచ్ఛమైన తెలుగులో మీరు అనర్గళంగా ఉపన్యసిస్తూ వుంటే... వెధవది... శ్రోతలేమిటి యిక్కడ వున్న చెట్లు, పుట్టలు, బెంచీలు, కుర్చీలు, కూడా మైమరచి వినవటండీ! 'పొయట్స్ ఆర్ బోర్న్, ఆరేటర్స్ ఆర్ మేడ్', అని ఊ... పట్టుపట్టారు. ఎంత చెడ్డా 'పొగడ్త', 'కీర్తి దాహం' వున్నాయి చూసావ్..

యివి మనిషిని వెధవన్నేసి ఆడిస్తాయనుకో...'' అని బొళ్లున నవ్వారు మాస్టారు. 'పొయట్స్ ఆర్ బోర్న్, ఆరేటర్స్ ఆర్ మేడ్' అన్నదానికి, మాస్టారు మాట్లాడి తీరాల్సిరావడానికి వున్న పొత్తేమిటో అని ఆలోచిస్తున్న నేను మాస్టారి నవ్వుతో తృళ్ళిపడి ఆయన మాటల్లో నవ్వుకు కారణమయిన హాస్యమేమిటో అర్థం కాక తెల్లపోయి చూసాను.

"అంచేత ఉపన్యాసకుడిగా కూడ ఒప్పుకున్నాను. ఇన్ని పనులు మీద వున్నాయి కదా, కాస్త ముందస్తుగా వెళ్తే పెద్దల్ని నలుగుర్ని కలిసి మంచి, చెడ్డా మాట్లాడొచ్చు. పనిలో పని కోరుకొండ వెళ్ళి బాబుని కూడ చూచి రావచ్చని యీరోజు బయల్దేరి వెళ్తున్నాను. ఇప్పుడు వెళ్తున్నానన్న మాటేగాని యిక్కడ నేను లేకపోవడంవల్ల ఎన్ని పనులాగిపోతాయనుకున్నావ్! యీ ఊపిరి సలపని పనులతో రెండు నెలల నుండి సీరియల్‌ని పంపలేకపోయాను. ఎడిటర్ ఏడ్చుకుంటూ జాబు రాశాడు. "మహానుభావా! యిలా చేస్తే ఎలాగు? మీ సీరియల్ లేకపోవడం వల్ల మా పత్రిక సేల్స్ తగ్గిపోతున్నాయి. పాఠకులంతా మీ సీరియల్‌ను కంటిన్యూ చేయనందుకు మమ్మల్ని సంజాయిషీ అడుగుతూ కట్టలకి కట్టలు ఉత్తరాలు కురిపిస్తున్నారూ... అవటా అని...'' మాస్టారు ఊపిరి పీల్చుకోవడానికి ఆగారు. "మాస్టారూ! మీరు సీరియల్ వ్రాస్తున్నారాండీ?'' అడిగేశాను ఏమయతే అయిందని. మాస్టారు ఉరుమురిమినట్లు నవ్వారు. భయం భయంగా చుట్టూ చూసాను. ఆ త్రొక్కిసలాటలో ఎవరి గొడవలో వాళ్లున్నారు. "భలేదానివే యీరోజున నాపేరెరుగని వాడూ, నా రచన చదవని వాడూ తెలుగు వచ్చిన వాళ్ళల్లో ఎవరున్నారసలు?'' మాస్టారు తీక్షణంగా ప్రశ్నించేసరికి భయపడిపోయాను. కాని తెలుగులో కాస్త పేరున్న పత్రికలన్నిటినీ సంపాదకీయం, ఉత్తరాల శీర్షికనుండి చిత్రలోకం, గ్రంథ సమీక్ష వరకు చదివే నాకు 'భానుమూర్తి' అన్న పేరు ఎక్కడా చూచినట్లు గుర్తులేదు. చటుక్కున ఓ ఆలోచన వచ్చింది.

"మాస్టారూ! మీరు పెన్‌నేమ్ ఏమన్నా పెట్టుకున్నారా?''

"ఔను నా పేరుతో పంపితే తిరుగు టపాలో తిరిగొచ్చాయి నా రచనలు. ఆ రోజుల్లో చాలా డిసెప్పాయింట్ అయిపోయాను. ఆ తరువాత ఓ స్నేహితుడు కనబడి 'ఆడపిల్ల పేరుతో పంపితే మరి ఢోకా వుండదు, మరుసంచికలో నీ రచన వస్తుంది' అని ఉచిత సలహా యిచ్చాడు. ఆ పళాన 'హేమంతి' అని పేరు మార్చేసాను.'' యించు మించు షాక్ తిన్నట్లయింది నాకు. అసలే మతిపోయి చూస్తున్ననేను యిప్పుడు విన్నది నిజమో కాదో తేల్చుకోలేకపోయాను. మరి

'హేమంతి' సీరియల్ ఒకటి రెండు నెలలనుండి ఆగిపోయిన మాట నిజమే. అనివార్య కారణాలవల్ల ప్రచురించలేకపోతున్నామని ప్రకటించాడు ఎడిటర్. ఓ నిమిషం తరువాత తర్జన భర్జన చేసి భానుమూర్తి మాస్టారే 'హేమంతి' అని కష్టపడి నన్ను నేను నమ్మించుకున్నాను. ఆ నమ్మిక మనసుకు బాగా పట్టిన తరువాత మాస్టారు యింత వరకు చెప్పిన మాటల్లో మరి అనుమానపు ఛాయ కూడ లేకుండా పోయింది. క్రొత్త ఉత్సాహంతో మాస్టారు ముందు చెప్పబోయేదాన్ని వినడానికి కుతూహల పడ్డాను.

"నాకు మీ రచనలంటే చాలా యిష్టం మాస్టారూ! కాని యింత కాలం మీరే 'హేమంతి' అని తెలియదు. లేకపోతే మా మాస్టారే 'హేమంతి' అని అందరితో చెప్పి వుందును." చాల నష్టపోయినట్లు మాట్లాడాను.

"అబ్బెబ్బె! అసలు నేనే 'హేమంతి' అని తెలియడం నాకంతగా యిష్టం వుండదు. చాల మందికి తెలియదు కూడా! అంచేత నటుడిగా నేను ఆంధ్రదేశానికి పరిచయమైనంతగా రచయితగా కాలేదు. ఇప్పుడిక్కడికి రావడం వల్ల 'రవీంద్ర భారతి'లో ఇరవయ్యో తారీఖున వుండవలసిన మా ప్రోగ్రాం ఒకటి కాన్సిల్ అయింది." యీసారి నేనంతగా ఆశ్చర్యపడలేదు. కాలేజీలో చదివేప్పుడు కాలేజ్ డ్రామాల్లో నటించడం, ఉద్యోగంలో చేరిన తరువాత కూడ నటన మీద, నాటకాల మీద ఈయన పెద్ద పెద్ద అభిప్రాయాలు వెలిబుచ్చడం నేనెరిగిన విషయమే.

"అన్నట్టు నేను ఏక్ట్ చేస్తున్న పిక్చర్ నెక్ట్స్ జాన్యువరిలో విడుదలవుతుంది. తప్పితే, ఫిబ్రవరిలో".

అదిరిపడ్డాను!

"ఆ పిక్చర్‌లో నేను హీరోగా సెలక్టవడమే చాలా చిత్రంగా జరిగిందిలే. నేను వ్రాసిన పాట సినిమా పెద్దలకి నలుగురికీ చూపించి కవిగానో నా కంఠ మాధుర్యాన్ని చూపించి ప్లేబాక్ సింగర్‌గానో మద్రాసులో స్థిరపడిపోదామని వెళ్ళాను. కానీ నా పర్సనాలిటీని చూచి 'అబ్బాయ్! నువ్వు కవిగానూ, తెర వెనుక గాయకుడి గానూ కంటే తెర మీద హీరోగా బాగా రాణిస్తావు అని, ఆలస్యమయితే మళ్ళీ నన్నెవరన్నా తన్నేసుకుపోతారేమోనన్న భయంతో వెంటనే తమ పిక్చర్‌లో బుక్ చేసేసుకున్నారు 'మహాభ్యుదయ పిక్చర్స్' వారు." మహా ఉత్సాహంతో చెప్పుకు పోతున్నారు మాస్టారు.

ఇంద్రజాలికుడి అద్భుత కథ వింటున్నట్లు కూర్చున్నాను.

"అన్నట్లు మీ బావ ఇంజనీరింగ్ కదూ చదువుతూంట!" హఠాత్తుగా అడిగారు మాస్టారు.

"అవునండీ"

"సరే అదేదో అయిపోగానే నన్నొచ్చి కలుసుకోమను. నిమిషాల మీద సౌండ్ ఇంజనీర్‌గా వేయిస్తా... మనకప్పుడే ఫీల్డ్‌లో బాగా నేమ్ వచ్చేసిందిలే." కాబోలనుకున్నాను.

"అబ్బే! మాబావకు నా రికమేండేషన్‌లూ, నా సలహాలూ నచ్చవులెండి" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"అదెంత మాట! కాబోయే భార్యవు కదా! నీ మాట వినకేం చేస్తాడు? అతనికి మాత్రం తెలియదు కనుకనా, ఈ రోజుల్లో రికమెండేషన్ విలువ దేనికీ లేదని. నామట్టుకు నన్నే చూడరాదూ! అన్ని అర్హతలూ వుండీ, సమంగా రికమెండేషన్ లేక విప్లవ పత్రికకు సబ్ ఎడిటర్నయాను. ఆ రికమండేషన్ వున్న మరో చచ్చు సన్నాసి ఎడిటరయ్యాడు" మాస్టారు యిన్ని పనులనెలా నిర్వహించ గలుగుతున్నారబ్బా! యివన్నీ వట్టి కోతలని తీసి పారేయడానికస్సలు వీల్లేదు. నాకు తెలిసినంత వరకూ భానుమూర్తి మాస్టారు కోతల్రాయుడు కారు. పైగా సాధ్యమైనంత వరకు నిజాన్ని చెప్పాలనే మనిషి.

బస్సు నాలుగడుగులు ఎగిరిపడడంతో ప్రయాణీకులంతా ఒక్కసారి గొల్లుమన్నారు.

"యిదీ యిలా వుంది మన రోడ్ల పరిస్థితి, ప్రయాణికుల దుస్థితి. దీనికంతకూ కారణమెవరంటావ్?" మాస్టారి మాటల్లో ఆవేశపు జీర కదుల్తాంది. అంత ఆవేశంలోనూ అలంకార సహితంగా మాస్టారు మాటల్ని వాడుతూ వుంటే చూస్తూ కూర్చుండిపోయాను. ఐనా మాస్టారు నానుండి జవాబు ఆశించి ఆ ప్రశ్న వేయలేదని గ్రహించాను. అయనే చెప్పడం మొదలు పెట్టారు.

"దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యం. అందమైన కార్లలో నున్నటి సిమెంట్ రోడ్లమీద తిరిగే వాళ్ళని యిలాంటి ప్రదేశాలకి రప్పించి యీ రోడ్లని, బస్సులని చూపించాలి. అందుకే బాగా ఆలోచించి నేనో పథకం వేసాను. రేపు డిసెంబర్‌లో మీ ఊళ్లో పెద్దపెద్ద సభల్ని ఏర్పాటు చేయిస్తున్నాను. అందుకోసం ఊళ్లో పెద్దలు నలుగురితో మాట్లాడదామని మీ ఊళ్లోదిగాను. అంతా చాలా ఉత్సాహాన్ని

చూపించి నాకు తగిన ప్రోత్సాహమిచ్చారు. ఆర్థికంగా కూడా ఎవరి స్థోమతుకు తగ్గట్లు వాళ్లు సహాయం చేస్తామన్నారు. నాకు చాలా ఆనందంగా వుంది." మాస్టారు ఉత్సాహంగా చెప్పుకుపోతున్నారు. ఈసారి ఆశ్చర్యంతో మతిపోయింది నాకు. మా ఊళ్లో, మా ఆండమాన్స్‌లో పెద్ద పెద్ద సభలా? డబ్బు, సంపాదన, పంతాలు, పోట్లాటలు, పార్టీలు, కక్షలు, కావేశాలు తప్పితే మరొకటి ఎరుగని మాఊరి ప్రజానీకం సభలంటే యింత ఆసక్తి చూపడం! పైగా ఆర్థిక సహాయం చేస్తామని కూడా హామీ యివ్వడం!

"కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా ఉంటాయి. నువ్వూ నీ ఫ్రెండ్స్ కలసి ఓ డ్రామాకి ప్రిపేరవకూడదూ? వాళ్ళు మీవూళ్ళోనే కదా కాపురాలు చేస్తూంది. అక్కినేని, ఎన్.టి.ఆర్. జమున, సావిత్రి మొదలైన వారంతా వస్తున్నారు." వింటున్న కొద్దీ మరీ మతిపోతూంది నాకు.

"ప్చ్! అదెక్కడ సాధ్యపడుతుందిలెండి. అప్పుడేదో సరదా కొద్దీ స్కూల్ ఫంక్షన్‌కి వేసాం కాని యీరోజు వెయ్యాలంటే ఎలా కుదురుతుంది? కాలేజీ ఎగ్గొట్టి నేను రాలేను కదా! యింక నా ఫ్రెండ్స్ స్టేజ్ ఎక్కి మరి కాపురాలు చేసుకోగలరా? అంతవరకు యింకా పెరగలేదు కదా మనం." అన్నాను. దూరంగా వున్న సూట్‌కేసును దగ్గరగా జరుపుకుంటూ. రోడ్డుని పూర్తిగా ఆక్రమించిన ఆవుల్ని, గేదెల్నీ తప్పించుకుటూ గమ్యస్థానం చేరుతూంది బస్.

"ఇదిగో యీ భావాలే మీ స్త్రీలని మరింత అణగద్రొక్కేస్తున్నాయి. నారీ లోకాన్ని ఉత్తేజింపజేసే కార్యక్రమాలు కూడ వుండేలా చూస్తున్నాను యీ సభల్లో. వీలయితే దుర్గాబాయి దేశముఖ్‌ని, రాజకుమారి అమృత కౌర్‌ని ఆహ్వానించాలనుకుంటున్నాను." మాస్టారికి సాధ్యంకాని పనిలేదా అనిపించింది.

"సభలకు ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రిని ప్రధానమంత్రిని ఆహ్వానిస్తున్నాము." నాకు స్పృహ తప్పిపోతున్నట్లనిపించింది. బస్సు ఆగడంతో సూట్ కేస్ తీసుకుని ఏదో లోకంలో వున్నదానిలా బస్సు దిగాను.

" వెళ్లొస్తాను శారదా! యీవూళ్ళో మా అత్తయ్య వుంది. ఆమెని చూచి రేపు రాత్రికి వైజాగ్‌కు బయల్దేరుతాను. సభలకు ఇన్విటేషన్ పంపిస్తాను. తప్పకుండా రావాలి" అన్నారు మాస్టారు.

"అలాగే, నిర్మలగారిని అడిగానని చెప్పండి మాస్టారూ!"

బస్టాండ్ నుంచి స్టేషన్‌కు రిక్షా మాట్లాడి ఎక్కబోతున్నాను.

"ఏయ్ శారూ!" లలిత కంఠం, పట్టజాలని ఆనందంలో వెనక్కు తిరిగాను. శ్రీవారితోనూ, పాపతోనూ కలిసి నావైపు వస్తోంది లలిత. మూడేళ్ల తరువాత మళ్ళీ యిదే లలితను చూడడం.

రిక్షా దగ్గర నిలబడే ఓ పావుగంట మాట్లాడేసుకున్నాం. ఇంక రిక్షావాడు విసుక్కోవడంతో రిక్షా ఎక్కాను. చటుక్కున మాస్టారు గుర్తుకు వచ్చారు.

"భానుమూర్తి మాస్టరు కనిపించారే లలితా" అన్నాను ఉత్సాహంగా.

"పాపం!" అంది లలిత నీరసంగా నిట్టూరుస్తూ.

"అదేం? అలా జాలిపడతావ్. ఆయన చాలా గొప్పవారయారు తెల్సా"

"నీ మొహంలా వుంది. మతి చలించి ఆయన తిరుగుతూంటే గొప్ప వారయారా? ఐదేళ్ళు పెరిగిన ముద్దులు మూటగట్టే బాబు వారంరోజుల జ్వరంతో కన్నుమూసాడు. తరువాత కొద్దిరోజులకే పుట్టినపాప నెల రోజులలోపే చనిపోయింది. ఆ దుఃఖాన్ని భరించలేక నిర్మలగారు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అతికష్టం మీద వికారమయిన ఆమె శరీరాన్ని కాపాడారు. యింతలో పులి మీద పుట్రలాగా ఐదువేల అప్పునీ, ఇద్దరు తమ్ముళ్ళ భవిష్యత్తుని తీర్చిదిద్దాల్సిన బాధ్యతనీ, ముగ్గురు చెల్లెళ్ల పెళ్లి చేయాల్సిన భారాన్నీ, వదులుకోలేని దర్జా జీవితపు ఖర్చుల్నీ మిగిల్చి చనిపోయారు వాళ్ళ నాన్నగారు. వీటన్నిటినీ భరించలేక, గుండె పగిలి, మతితప్పి దేశంమీద పడ్డారు మాస్టారు."యింక వినలేకపోయాను.

"వస్తానే లలితా" రిక్షావాడిని పోనీయమన్నాను.

మతిచలించిన మాస్టారు! అజ్ఞాతంగా వున్న ఆయన కోరికల్ని, ఒకనాడు ఆయన కన్నకలల్ని నిజమయినట్లు చిత్రీకరించుకుని చెప్పుకుంటున్నారా భానుమూర్తి మాస్టారూ! యింత విషాదంగా బ్రతుకున్నారా నా ఊహల్లో, నా ఎదుట కొద్దిక్షణాలు సుందర చిత్రంలా నిలచిన భానుమూర్తి మాస్టారు!

లలిత మాటలతో నాఊహల్లోని సుందర చిత్రం చిరిగిపోయింది. ఆ అవశేషాల్ని చూచే ధైర్యం లేక బాధగా కళ్ళు మూసుకున్నాను.

- *ఆంధ్రా మెడికల్ కాలేజీ మేగజైన్, 1966*